# దేశ జాతీయ సమైక్యతకు

# ప్రతీక హిందీ భాష

- మహబూబాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ నరేష్
- మైనారిటీ గురుకులంలో ఘనంగా హిందీ దినోత్సవం




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్13:** హిందీ భాష భారత దేశ జాతీయ సమైక్యతకు ప్రతీక అని మహబూబాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమిక్ కోఆర్డినేటర్ నరేష్ అధ్యక్షత వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు వేముల కల్పన, ఆర్ట్ టీచర్ రామకృష్ణల ప్రోత్సాహంతో విద్యార్థులు 30 చార్ట్‌లను రూపొందించి ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో హిందీ ఉపాధ్యాయురాలు కల్పన మాట్లాడుతూ....భారత జాతీయ ఉద్యమంలో దేశ ప్రజలను ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగ సభ హిందీని అధికార భాషగా గుర్తించిందని, ఆ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఇదే రోజున హిందీ దినోత్సవం జరుపుకుంటున్నామని ఆమె తెలిపారు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీని రాజ్యాంగం అధికార భాషగా స్వీకరించిందని ఆమె గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు. విద్యార్థులు తమ హిందీ ఉపాధ్యాయులను పూలబోకే ఇచ్చి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇమాముద్దీన్ మహ్మద్,వికాస్, రామన్న,లక్ష్మణ్,సురేందర్,రవి, సాదత్ సిద్ధిఖ్,మహేష్,వెంకన్న,మూర్తి,వార్డెన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# రైతు బిడ్డ డా.హరీష్ రాజ్ సేవలు

# అభినందనీయం

- డా.రవీంద్ర నాయక్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్13:** సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ఉన్నత స్థాయికి ఎదిగి మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పదవీ విరమణ చేసిన డాక్టర్ హరీష్ రాజ్ సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ డి. రవీంద్ర నాయక్ కొనియాడారు. వరంగల్‌లో జరిగిన ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ... డాక్టర్ హరీష్ రాజ్ ఆదిలాబాద్ జిల్లాలో తన ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టి, వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా, ఆ తర్వాత మహాత్మా గాంధీ ఆసుపత్రిలో ఆర్ ఎంఓగా, అలాగే జనగామ, మహబూబాబాద్, మంచిర్యాల జిల్లాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో డాక్టర్ హరీష్ రాజ్ కీలక పాత్ర పోషించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారని, ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని డాక్టర్ రవీంద్ర నాయక్ పేర్కొన్నారు.అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పిల్లి సాంబశివరావు,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య,రాష్ట్ర డీఎంహెచ్ఓల సంఘం అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, మహబూబా బాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు, సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, వివిధ జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.